https://trinetnews.com/

# ట్రైనెట్ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

## తాజా తెలుగు వార్తలు

ప్రతి 3 గంటలకు

98497 67747 | 9494184136


1 PM TO 4 PM

సంపుటి: 01 / సంచిక:23 / పేజీలు :02 / వేల:2/రూ / ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు / మంగళవారం, సెప్టెంబర్ 08,2026


▶ బీఆర్ఎస్‌లా సస్పెన్షన్ల సంస్కృతి తమది కాదని స్పష్టీకరణ

▶ ఈ వ్యవహారంలో కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్

# తాతా మధుపై చర్యలు తీసుకునే అధికారం తనకు ఉందన్న స్పీకర్



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు08

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు తనపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకునే అధికారం తనకు ఉన్నప్పటికీ, ప్రస్తుతానికి ఆ దిశగా వెళ్లడం లేదని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ స్పష్టం చేశారు. తాతా మధు శాసనసభ సభ్యుడు కాకపోయినప్పటికీ (ఎమ్మెల్సీ), సభాధిపతిగా ఆయనపై చర్య తీసుకునే అధికారం తనకు ఉందని ఆయన పేర్కొన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు."బీఆర్ఎస్ హయాంలో మాదిరిగా ఎవరినీ అకస్మాత్తుగా సస్పెండ్ చేయబోమని, ఈ వ్యవహారాన్ని ప్రజాస్వామ్య పద్ధతిలోనే పరిష్కరిస్తాం" అని ప్రసాద్ కుమార్ వెల్లడించారు. ఈ వివాదంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్వయంగా క్షమాపణ చెప్పాలని ప్రభుత్వం డిమాండ్ చేస్తోందని ఆయన తెలిపారు. ప్రతి అసెంబ్లీ సమావేశానికి ముందు సభకు హాజరుకావాలని తాను వ్యక్తిగతంగా కేసీఆర్‌ను కోరుతూనే ఉన్నానని ఆయన గుర్తుచేశారు.అసెంబ్లీలో మహిళా సభ్యుల పట్ల పోలీసులు అనుచితంగా ప్రవర్తించారన్న ఆరోపణలపైనా స్పీకర్ స్పందించారు. విచారణలో పోలీసుల తప్పిదం ఉన్నట్లు తేలితే కచ్చితంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా, నేటి సభా కార్యక్రమాలకు తాను అధ్యక్షత వహించడం లేదని, ప్యానెల్ స్పీకర్ కడియం శ్రీహరి సభను నిర్వహిస్తారని గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు.

# లైసెన్స్‌డ్ సర్వేయర్ల అసెంబ్లీ ముట్టడి..

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు08

కాంగ్రెస్ సర్కార్ పాలనలో ఓ వైపు ఉద్యోగ నోటిఫికేషన్లు లేక నిరుద్యోగులు ఆందోళన చేస్తుంటే.. మరోవైపు ఉద్యోగులు తమ డిమాండ్లు నెరవేర్చాలంటూ రోడ్డెక్కుతున్నారని తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు రేవంత్ సర్కార్ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళన బాట పడుతున్నారు. తాజాగా ఈ జాబితాలో లైసెన్స్‌డ్ సర్వేయర్లు కూడా చేరిపోయారు.కాంగ్రెస్ ప్రభుత్వం తమ డిమాండ్లు నెరవేర్చాలని లైసెన్స్‌డ్ సర్వేయర్లు అసెంబ్లీని ముట్టడించారు. ఈ క్రమంలో లైసెన్స్‌డ్ సర్వేయర్లను అరెస్ట్ చేసిన పోలీసులు పోలీస్ స్టేషన్లకు తరలించారు. పోలీసులు లైసెన్స్‌డ్ సర్వేయర్లను వెంబడించి.. పరుగెత్తించి మరీ అరెస్ట్ చేయడం వీడియలో చూడొచ్చు.





# ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొననున్న పుతిన్, మోదీ

న్యూఢిల్లీ: ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు08

ప్రధాని మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్. శుక్రవారం ఢిల్లీలో ద్వైపాక్షిక భేటీలో పాల్గొనున్నారు. వాణిజ్యం, ఆర్థిక సహకారంపై చర్చించనున్నట్లు క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ తెలిపారు. బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు పుతిన్ ఇండియా వస్తున్నారు. సెప్టెంబర్ 12వ తేదీ నుంచి ఢిల్లీలో ఆ సదస్సు జరగనున్నది. ద్వైపాక్షిక సంబంధాలపై పుతిన్, మోదీ భేటీలో చర్చించనున్నట్లు దిమిత్రి తెలిపారు. బ్రిక్స్ సమ్మిట్‌ను హోస్ట్ చేస్తున్న ఇండియా దాంట్లో సక్సెస్ కావాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కొన్ని దేశాల తమ కరెన్సీతో భారత్‌పై వత్తిడి తెస్తున్న నేపథ్యంలో ఆర్థిక రంగం గురించి కూడా చర్చించనున్నట్లు ఆయన తెలిపారు. సుఖోయ్-57 ఫిఫ్త్ జనరేషన్ యుద్ధ విమానాలు, అణ్వస్త్ర విద్యుత్తు కేంద్రాలు, అమెరికా ఆంక్షల గురించి కూడా ఇరువురు నేతలు చర్చించనున్నారు.

# పోలీసు విచారణకు హాజరైన యూట్యూబర్ నందన..

అద్దంకిలో కూడా మరో కేసు నమోదు

విదేశాల్లో ఉద్యోగాల పేరుతో మోసం చేసినట్టు నందనపై ఆరోపణలు

ఇబ్రహీంపట్నం పీఎస్ లో న్యాయవాదులతో కలిసి విచారణకు హాజరైన నందన

రూ. 13 లక్షలు తీసుకుని మోసం చేసిందంటూ క్రాంతి అనే వ్యక్తి ఫిర్యాదు



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు08

వీసాలు, విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ డబ్బులు వసూలు చేసి మోసం చేసిందన్న ఆరోపణల కేసులో ప్రముఖ యూట్యూబర్ రమానందన చిక్కుల్లో పడింది. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ లో నమోదైన వీసా చీటింగ్ కేసులో ఆమె తన న్యాయవాదులతో కలిసి పోలీసుల ఎదుట విచారణకు హాజరైంది. విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రమానందన దంపతులు తన వద్ద నుంచి రూ.13 లక్షలు వసూలు చేసి మోసం చేశారని బాధితుడు క్రాంతి కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. యూకే నుంచి హైదరాబాద్ చేరుకున్న వెంటనే విచారణకు హాజరుకావాలని పోలీసులు నోటీసులు జారీ చేయడంతో ఆమె పీఎస్‌కు వచ్చింది.మరోవైపు, రమానందనపై ప్రకాశం జిల్లా అద్దంకి పోలీస్ స్టేషన్ లో కూడా మరో వీసా స్కామ్ కేసు నమోదు కావడం సంచలనం సృష్టిస్తోంది. 'డెస్టినీ కన్సల్టెన్సీ' పేరిట వీసా రెన్యువల్, సర్టిఫికెట్ ఆఫ్ స్పాన్సర్‌షిప్ ఇప్పిస్తామని నమ్మించి 2023లో తమ వద్ద భారీగా డబ్బులు వసూలు చేసి మోసం చేశారని బాధితులు పోలీసులను ఆశ్రయించారు. వరుస కేసులు నమోదవ్వడంతో బాధితులను ఇబ్రహీంపట్నం పీఎస్‌కే రావాలని రమానందన కోరినట్లు సమాచారం. దీంతో హైదరాబాద్‌తో పాటు అద్దంకికి చెందిన బాధితులు కూడా భారీగా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌కు చేరుకుంటున్నారు.


# ఫాంహౌస్ కు వెళ్తున్న కేటీఆర్, హరీశ్ రావు అరెస్ట్

- కేసీఆర్‌ను కలిసేందుకు అసెంబ్లీ నుంచి బయలుదేరిన బీఆర్ఎస్ నేతలు
- మేడ్చల్ వద్ద అడ్డుకున్న పోలీసులు
- రోడ్డుపైనే నిరసనకు దిగిన కేటీఆర్, హరీశ్ రావు



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు08

ఎర్రవెల్లిలోని ఫామ్‌హౌస్‌లో ఉన్న బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసేందుకు బయలుదేరిన బీఆర్ఎస్ కీలక నాయకత్వాన్ని పోలీసులు మార్గమధ్యంలోనే అడ్డుకుని అరెస్టు చేయడం తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టించింది. అసెంబ్లీ నుంచి ఎర్రవెల్లికి పయనమైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావుతో పాటు పలువురు ఎమ్మెల్యేల వాహనాల కాన్వాయ్‌ను మేడ్చల్ పరిసర ప్రాంతాల్లో పోలీసులు బారికేడ్లు పెట్టి నిలిపివేశారు. వారిని అరెస్ట్ చేసి బోయిన్ పల్లి, జవహర్ నగర్ పోలీస్ స్టేషన్లకు తరలించారు.ఈ క్రమంలో పోలీసుల తీరుపై కేటీఆర్, హరీశ్ రావులు మండిపడ్డారు. శాంతియుతంగా వెళుతున్న తమను ఏ ప్రాతిపదికన అడ్డుకుంటున్నారని నిలదీస్తూ కేటీఆర్, హరీశ్ రావు రోడ్డుపైనే నిరసనకు దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ క్రమంలో పోలీసులు, బీఆర్ఎస్ నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. ప్రతిపక్ష నేతలను నిరోధించడమే లక్ష్యంగా పోలీసులు ప్రవర్తిస్తున్నారని బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేయగా... ప్రభుత్వ ఉత్తర్వుల మేరకే శాంతిభద్రతల పరిరక్షణకు విధుల్లో ఉన్నామని పోలీసులు తెలిపారు. పరిస్థితి చేయిదాటిపోతుండటంతో కేటీఆర్, హరీశ్ రావు సహా ఇతర ఎమ్మెల్యేలను పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్లకు తరలించారు.



# కేసీఆర్‌ను తిట్టేందుకు ప్రత్యేక సభ పెట్టండి

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు08

సీఎం రేవంత్ రెడ్డితో సహా అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు నిత్యం కేసీఆర్‌పై విమర్శలు గుప్పిస్తుండటంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. కేసీఆర్‌ను తిట్టేందుకు ఒకరోజు ప్రత్యేకంగా సభ పెట్టాలని ప్రభుత్వానికి సూచించారు. మిగిలిన రోజుల్లో ప్రజా సమస్యలు, అమలుకాని హామీలపై చర్చిద్దామని ఎద్దేవా చేశారు. ఎర్రవల్లికి వెళ్తున్న తనను పోలీసులు మార్గమధ్యలో అడ్డుకుని బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించడంతో పోలీస్‌స్టేషన్ దగ్గరే ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలోని లోపాలను బీఆర్ఎస్ పార్టీ ఎండగడుతుండటంతో రేవంత్ రెడ్డి సర్కారు ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఈ లోపాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులు బనాయిస్తోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ తీరుపై బీఆర్ఎస్ భగ్గుమన్నది. అసెంబ్లీ సాక్షిగా కాంగ్రెస్‌ను ఎండగట్టేందుకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో రేవంత్ సర్కారు కుట్రలకు తెరలేపింది. సోమవారం బీఆర్ఎస్ మహిళ ఎమ్మెల్యేపై అవమానకర రీతిలో దాడులు చేయించింది. తిరిగి బీఆర్ఎస్ నేతలపైనే అక్రమంగా కేసులు పెట్టించింది. పైగా ఒకవైపు అసెంబ్లీ నడుస్తుంటే మరోవైపు అధికార పార్టీ ఎమ్మెల్యేలు కొందరిని కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై దాడికి పంపించింది.



# రేవంత్ రెడ్డి నిరంకుశ విధానాలను నిరసిస్తూ భారీ నిరసన తెలిపిన మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి

ట్రైనెట్ న్యూస్, యాదాద్రి భువనగిరి, సెప్టెంబరు 08:

బిఆర్ఎస్ శాసనసభ్యులను అసెంబ్లీ లోపలికి రానివ్వకుండా కర్కశంగా వ్యవహరించిన పోలీసులు మరియు మహిళా శాసనసభ్యుల చీర పట్టుకొని లాగి, వారిని గొంతు పట్టుకొని లాగిన రేవంత్ రెడ్డి ప్రభుత్వ నిరకుంశ విధానాలను నిరసిస్తూ మునుగోడు నియోజకవర్గ కేంద్రములో భారీ నిరసన తెలిపిన మునుగోడు మాజీ శాసనసభ్యులు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి.ఈ కార్యక్రమంలో భారీగా పాల్గొన్న బీఆర్ఎస్ శ్రేణులు, మహిళామణులు.

# రేవంత్ రెడ్డి నువ్వు మా చరిత్ర మర్చిపోయినట్టున్నావ్ : పట్లోళ్ల కార్తీక్ రెడ్డి

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు08

నేను ఇంద్రారెడ్డి కొడుకును.. ఆమె ఇంద్రారెడ్డి భార్య.. మా సిస్టమ్‌లో భయపెట్టుడే కానీ భయపడుడు ఉండదని బీఆర్ఎస్ నేత పట్లోళ్ల కార్తీక్ రెడ్డి స్పష్టం చేశారు. తన తల్లి, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ.. నిన్న అసెంబ్లీ వద్ద రేవంత్ రెడ్డి ఆదేశాలతో పోలీసులు మా అమ్మను అవమానించే విధంగా ప్రవర్తించారు. అలా చేస్తే మేము భయపడతామని అనుకుంటున్నాడు. రేవంత్ రెడ్డి నువ్వు మా చరిత్ర మర్చిపోయినట్లు ఉన్నావు. నక్సలైట్ల ఉద్యమం నుండి మా నాన్న రాజకీయాల్లోకి వచ్చాడు.. పోలీసులు ఎన్‌కౌంటర్‌కు తీసుకెళ్తేనే భయపడలేదు, దీనికి భయపడతామా అంటూ హెచ్చరించారు.ఇంద్రారెడ్డి హోం మంత్రి పదవి తీసేసి, ఆయనను చంద్రబాబు అక్రమంగా జైల్లో వేస్తేనే భయపడలేదు. ఇంద్రారెడ్డి చనిపోయినప్పుడు, వెంట ఎవరూ లేనప్పుడే మా అమ్మ ఒంటరిగా రాజకీయాల్లోకి పోయింది.. అప్పుడే భయపడలేదు, ఇప్పుడు భయపడతామా..? నేనే కానీ, నా కార్యకర్తలే కానీ, ఇంద్రారెడ్డి అభిమానులే కానీ ఒక్క చుక్క కూడా భయపడం.. రెండింతల తిరిగి కొట్లాడుతామన్నారు. మహానేత వైఎస్సార్ చనిపోయినప్పుడు కాంగ్రెస్‌లో ఎవరుంటారు మాకు అన్నప్పుడు కూడా మా అమ్మ భయపడలేదు. మమ్మల్ని కాంగ్రెస్ పార్టీలో నుంచి వెళ్లగొట్టినప్పుడు భయపడలేదు. అన్యాయంగా కేసులు పెట్టినప్పుడు భయపడలేదు. ఇప్పుడు భయపడ్తమని మీకెవరు చెప్పారన్నారు.



# కేసీఆర్‌ను ఎలా కాపాడుకోవాలో మాకు తెలుసు: జగదీశ్ రెడ్డి



కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కేసీఆర్ ఫాంహౌస్ వైపు పంపడం ఏ రకమైన సంస్కారమన్న జగదీశ్ రెడ్డి

కేసీఆర్‌ను అంతమొందించేందుకే వెళుతున్నామని ఓ ఎమ్మెల్యే అన్నారని మండిపాటు

కేసీఆర్ పైకి కావాలనే నిరసనకారులను పంపుతున్నారని ఆగ్రహం

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు08

తాము బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో పనిచేస్తున్న క్రమశిక్షణ కలిగిన సైనికులమని... కాంగ్రెస్ ప్రభుత్వ అణచివేత చర్యలకు, పోలీసుల అక్రమ అరెస్టులకు తాము ఏమాత్రం భయపడేది లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ దారుణాలను, వైఫల్యాలను ప్రజల కళ్లకు కట్టినట్లు ఎండగడుతుంటే తట్టుకోలేకనే ప్రతిపక్షంపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ నడుస్తుండగా ప్రభుత్వ విప్‌లు, అధికార పార్టీ ఎమ్మెల్యేలను డప్పులు కొట్టుకుంటూ కేసీఆర్ ఫాంహౌస్ వైపు పంపడం ఏ రకమైన సంస్కారమని జగదీశ్ రెడ్డి నిలదీశారు. 'కేసీఆర్‌ను అంతమొందించేందుకే వెళుతున్నాం' అని ఒక కాంగ్రెస్ ఎమ్మెల్యే బహిరంగంగానే తీవ్ర వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. ఆయనపై పోలీసులు వెంటనే సుమోటోగా కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌పైకి కావాలనే నిరసనకారులను పంపుతున్నారని, పోలీసులు వారిని ఆపకపోతే బీఆర్ఎస్ శ్రేణులే రంగంలోకి దిగి తగిన రీతిలో బుద్ధి చెబుతాయని జగదీశ్ రెడ్డి హెచ్చరించారు. కేసీఆర్‌ను కాపాడుకోవడం తమకు, తెలంగాణ సమాజానికి పెద్ద కష్టమేమీ కాదని తేల్చిచెప్పారు.శాసనసభకు వస్తున్న ప్రజాప్రతినిధులను అడ్డుకోవడంపై తాము హైకోర్టును ఆశ్రయించగా... ప్రతిపక్ష ఎమ్మెల్యేలను అసెంబ్లీకి రాకుండా ఎవరు, ఎందుకు అడ్డుకున్నారనే వివరాలను రెండు వారాల్లో సమర్పించాలని అత్యున్నత న్యాయస్థానం ప్రభుత్వాన్ని ఆదేశించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఆ భయంతోనే రాత్రికి రాత్రే బీఆర్ఎస్ నేతలపై తప్పుడు కేసులు నమోదు చేశారని ధ్వజమెత్తారు.నిరుద్యోగులకు ఉద్యోగాలు, ప్రజలకు తాగడానికి, సాగుకు నీళ్లు ఇవ్వలేక, పేదల భూములను గుంజుకుని అమ్ముకుంటూ కాంగ్రెస్ నేతలు సొంత జేబులు నింపుకుంటున్నారని దుయ్యబట్టారు.


# అక్రమ కేసులతో బీఆర్ఎస్‌ను భయ పెట్టలేరు



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు08

పోలీసులను అడ్డుపెట్టుకుని బీఆర్ఎస్ నాయకులను, కార్యకర్తలను వేధించాలని ప్రభుత్వం చూస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసానికి కాలి నడకన వెళ్తున్న కేటీఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు సహా ఇతర బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు హకీంపేట వద్ద అరెస్ట్ చేసి వారిని బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ నేపథ్యంలో బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ వద్ద కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ఇలాంటి కక్షపూరిత చర్యలకు మేము భయపడేది లేదన్నారు. ప్రజా సమస్యల నుండి దృష్టి మళ్లించడానికే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి అక్రమ అరెస్టులు, కేసులు పెడుతోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ ప్రజల పక్షాన ఉంటుంది. ప్రజా గొంతుకగా ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. కార్యకర్తలు ఎవరూ అధైర్యపడవద్దు, ధైర్యంగా ఉండాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. రేవంత్ రెడ్డికి దళితులపై నిజంగానే ప్రేమ ఉంటే.. దళిత గిరిజన డిక్లరేషన్‌లలో ఇచ్చిన హామీలు అమలు చేసి చూపించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.తెలంగాణను సాధించిన నాయకుడు కేసీఆర్‌ను చంపాలని, ఆయన చావాలని కోరుకుంటూ కాంగ్రెస్ గూండాలను రేవంత్ రెడ్డి పంపిస్తున్నాడని ధ్వజమెత్తారు. కేసీఆర్ చావును కోరుకుంటున్న రేవంత్ రెడ్డి.. నీ దిక్కుమాలిన రాజకీయాలను తెలంగాణ సమాజం మొత్తం గమనిస్తోందని..రేవంత్ రెడ్డికి ఏ సమయంలో ఎట్లా వాత పెట్టాలో తెలంగాణ సమాజానికి తెలుసునని కేటీఆర్ పేర్కొన్నారు.

# శుభకార్యానికి హిజ్రాలు అంత కచ్చితంగా ఎలా వస్తారు?.. బయటపడ్డ పక్కా కమీషన్ దందా!



శుభకార్యాలకు హిజ్రాలు ఎలా వస్తారనే రహస్యంపై ఓ హిజ్రా స్పష్టత

టెంట్ హౌస్‌లు, పంతుళ్లు, వాచ్‌మెన్ల నుంచి సమాచారం అందుతుందని వెల్లడి

ఒక్కో ఫంక్షన్ లోకేషన్ చెప్పినందుకు రూ.2000 నుంచి రూ.3000 కమీషన్

కొందరి వల్లే తమందరికీ చెడ్డపేరు వస్తోందని ఆవేదన

చింతల్ ఘటన తర్వాత నెట్టింట చర్చనీయాంశమైన హిజ్రాల నెట్‌వర్క్

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు08

శుభకార్యాలు, వేడుకలు జరిగే ప్రదేశాలకు హిజ్రాలు కచ్చితంగా ఎలా వస్తారు? ఎక్కడ ఏ చిన్న ఫంక్షన్ జరిగినా వారికి ముందుగా సమాచారం ఎలా అందుతుంది? ఈ ప్రశ్నలు చాలామంది మదిని తొలిచేవే. ఇటీవల హైదరాబాద్‌లోని చింతల్‌లో ఓ గృహప్రవేశం సందర్భంగా హిజ్రాలు ప్రవర్తించిన తీరుపై తీవ్ర దుమారం రేగడంతో వారి సమాచార వ్యవస్థపై చర్చ మొదలైంది. దీని వెనుక ఓ పక్కా వ్యవస్థ, పెద్ద నెట్‌వర్క్ పనిచేస్తోందనే విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది.ఇంతకీ వీరికి సమాచారం ఎలా అందుతుందంటే.. దీని వెనుక పక్కా కమీషన్ దందా నడుస్తోందని ఓ హిజ్రా స్వయంగా ఓ యూట్యూబ్ ఛానెల్ ఇంటర్వ్యూలో వెల్లడించారు. పెళ్లిళ్లు, గృహప్రవేశాల వంటి శుభకార్యాల వివరాలను తమకు చేరవేసేందుకు ప్రత్యేకంగా కొందరు వ్యక్తులు పనిచేస్తారని ఆమె తెలిపారు. వారి ద్వారానే తమకు ఫంక్షన్ల లోకేషన్లు తెలుస్తాయని వివరించారు.

### సమాచారం ఇచ్చేది వీరే..

ఆమె చెప్పిన వివరాల ప్రకారం.. శుభకార్యాలకు సంబంధించిన వ్యక్తులే హిజ్రాలకు ప్రధాన ఇన్ఫార్మర్లు.

టెంట్ హౌస్ వాళ్లు: ఫంక్షన్‌కు టెంట్లు, కుర్చీలు సరఫరా చేసేవారు.

పంతుళ్లు: పూజలు, శుభకార్యాలు జరిపించే పురోహితులు.

గోమాతను తెచ్చేవారు: గృహప్రవేశాల వంటి వాటికి గోమాతను తీసుకువచ్చేవారు.

సన్నాయి మేళం వాళ్లు: ఫంక్షన్లలో సంగీత కార్యక్రమాలు నిర్వహించేవారు.

బిల్డర్లు, వాచ్‌మెన్లు: కొత్తగా నిర్మించిన ఇళ్లు, అపార్ట్‌మెంట్లలో పనిచేసేవారు.

ఈ వ్యక్తులు ఫలానా చోట ఫంక్షన్ జరుగుతోందని ముందుగానే తమకు ఫోన్ చేసి లోకేషన్ పంపిస్తారని సదరు హిజ్రా తెలిపారు.

### లోకేషన్‌కు రూ.3000 కమీషన్

కేవలం సమాచారం ఇవ్వడమే కాదు, దీనికి వారు కమీషన్ కూడా తీసుకుంటారని ఆమె చెప్పడం గమనార్హం. గతంలో ఒక్కో లోకేషన్‌కు రూ.200 నుంచి రూ.500 ఇచ్చేవాళ్లమని, ఇప్పుడు డిమాండ్ పెరగడంతో రూ.2000 ఇవ్వనిదే ఎవరూ సమాచారం ఇవ్వడం లేదని ఆమె అన్నారు. ముఖ్యంగా గృహప్రవేశానికి గోమాతను తీసుకొచ్చేవారు రూ.3000 వరకు డిమాండ్ చేస్తారని, అంత ఇస్తేనే గానీ అడ్రస్ చెప్పరని వివరించారు. ఈ నెట్‌వర్క్‌లో ఎవరు ముందుగా సమాచారం ఇస్తే, వారికే కమీషన్ డబ్బులు చెల్లిస్తామని తెలిపారు.

### కొందరి వల్లే అందరికీ చెడ్డపేరు

చింతల్ ఘటనపై స్పందిస్తూ, కొందరు హిజ్రాలు మాత్రమే డబ్బుల కోసం దౌర్జన్యంగా ప్రవర్తిస్తారని, వారి వల్లే తమ వర్గం మొత్తానికీ చెడ్డపేరు వస్తోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తామంతా కడుపు నింపుకోవడానికే ఈ పని చేస్తామని, చాలామంది ఎంత ఇస్తే అంత తీసుకుని ఆశీర్వదించి వెళ్లిపోతారని చెప్పారు. కొందరు దాతలు తమను స్వయంగా ఇళ్లకు పిలిపించుకుని గౌరవిస్తారని గుర్తుచేశారు. ఏదేమైనా శుభకార్యాల వద్ద హిజ్రాల సందడి వెనుక ఇంత పెద్ద కమీషన్ నెట్‌వర్క్ పనిచేస్తోందనే విషయం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

# వీర్లపల్లి శంకర్, సీఎం రేవంత్‌పై చర్యలు తీసుకోవాలి.. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఫిర్యాదు

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు08

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సచ్చిపోవాలి అంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన అనుచిత వ్యాఖ్యలు ప్రకంపనలు సృష్టిస్తున్న విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలకు నిరసనగా ఇప్పటికే బీఆర్ఎస్ శ్రేణులు వీర్లపల్లి శంకర్ దిష్టిబొమ్మ దహనం చేశారు.ఈ క్రమంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చనిపోవాలని వ్యాఖ్యానించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.. అతన్ని ప్రోత్సహిస్తున్న సీఎం రేవంత్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై దాడికి కాంగ్రెస్ నేతలు గుంపులుగా వెళ్లే క్రమంలో తాము కేసీఆర్ చావును కోరుకుంటున్నామని కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తల పొగరు వ్యాఖ్యలు చేశారని తెలిసిందే.



## వాట్సప్ గవర్నెన్స్, డిజిటల్ సేవలు.. పాలనలో బెస్ట్ ప్రాక్టీసెస్ పాటించాలి: ఎమ్మెల్యేలకు సీఎం

# చంద్రబాబు దిశానిర్దేశం

- ఉచిత ఇసుక విధానాన్ని పక్కాగా అమలు చేయాలని సీఎం ఆదేశం
- ఎమ్మార్పీ కంటే ఎక్కువకు మద్యం అమ్మితే కఠిన చర్యలని హెచ్చరిక
- ఫేక్ ప్రచారాన్ని వాస్తవాలతో సమర్థంగా తిప్పికొట్టాలని నేతలకు సూచన
- 175 నియోజకవర్గాల్లో రూ.20,400 కోట్ల విలువైన పనులకు ఆమోదం
- టెక్నాలజీ సాయంతో ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు08

ప్రభుత్వ, పరిపాలన సేవలను ప్రజలకు మరింత సమర్థంగా అందించడంపై దృష్టి సారించాలని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ ఎమ్మెల్యేలు, నేతలకు పిలుపునిచ్చారు. రెండోరోజు లీడర్‌షిప్ కాన్‌క్లేవ్‌లో ప్రసంగించిన ఆయన, కొన్ని నియోజకవర్గాలు పౌర సేవల్లో మంచి ఫలితాలు సాధిస్తున్నాయని, అన్ని నియోజకవర్గాలు ఆ ఉత్తమ పద్ధతులను (బెస్ట్ ప్రాక్టీసెస్) అమలు చేయాలని దిశానిర్దేశం చేశారు.ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక విధానాన్ని పక్కాగా అమలు చేస్తున్నామని, దీనివల్ల ఏటా రూ.1000 కోట్ల ఆదాయం వదులుకుంటున్నామని చంద్రబాబు గుర్తుచేశారు. ఎక్కడైనా ఇసుక అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలిపోతే కఠినంగా అడ్డుకోవాలని ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో మద్యం విధానాన్ని అస్తవ్యస్తం చేసి, నకిలీ బ్రాండ్లతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారని విమర్శించారు. ఇప్పుడు మద్యం విక్రయాల్లో పారదర్శకత తీసుకొచ్చామని, ఎమ్మార్పీ కంటే ఒక్క రూపాయి ఎక్కువకు విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విషయంలో అవకతవకలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత స్థానిక ఎమ్మెల్యేలదేనని స్పష్టం చేశారు.



### ఫేక్ ప్రచారాన్ని వాస్తవాలతో తిప్పికొట్టండి..

ప్రభుత్వంపై జరుగుతున్న ఫేక్ ప్రచారాలను వాస్తవాలతో సమర్థంగా తిప్పికొట్టాలని నేతలకు సూచించారు. వాట్సప్ గవర్నెన్స్ ద్వారా అనేక సేవలను ఆన్‌లైన్‌లోనే అందిస్తున్నామని, క్యూఆర్ కోడ్, బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో భద్రమైన పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేస్తున్నామని వివరించారు. నియోజకవర్గాల్లోని దీర్ఘకాలిక సమస్యలను సుమోటోగా స్వీకరించి పరిష్కరించాలని, తద్వారా ఎమ్మెల్యేలకు ప్రజల్లో మంచి పేరు వస్తుందని అన్నారు. ప్రజల సమస్యల పట్ల మానవత్వంతో స్పందిస్తే సానుకూల దృక్పథం ఏర్పడుతుందని తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా భూ వివాదాల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నామని, 2027 మార్చి నాటికి భూ రికార్డుల ప్రక్షాళన పూర్తి చేస్తామని చంద్రబాబు వెల్లడించారు. 'సంజీవని' ప్రాజెక్టు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డులు రూపొందిస్తున్నామని, గత మూడేళ్లుగా విద్యుత్ ఛార్జీలు పెంచలేదని గుర్తుచేశారు. గత సమావేశంలో ఎమ్మెల్యేలు లేవనెత్తిన అంశాలను సమీక్షించి, 175 నియోజకవర్గాల్లో రూ.20,400 కోట్ల విలువైన 616 అభివృద్ధి పనులను మంజూరు చేసినట్లు ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు.